## గనులను సింగరేణికే అప్పగించాలి




మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, జూన్ 24 : సింగరేణి గనుల వేలాన్ని వెంటనే నిలిపివేసి సంస్థకే అప్పగించాలని ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. సంస్థ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. వెంటనే కొత్త గనులు ఏర్పాటు చేయాలని, సింగరేణి ఆస్పత్రులను సూపర్‌స్పెషాలిటీ దవాఖానలుగా మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. యాజమాన్యానికి కార్మికుల సమస్యలపై తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చారన్నారు. ప్రాతినిధ్య సంఘంగా కార్మికుల సమస్యలు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, కార్యదర్శి భీంరావు, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, నాయకులు జక్కుల సాగర్, భీమిని రాజేశ్, కొలిపాక సమ్మయ్య, పేరం రమేశ్, శ్రీనివాస్, సమ్మిరెడ్డి, రౌతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణికి గనులు దక్కేవరకు పోరాటం..

రెబ్బెన, జూన్ 24 : సింగరేణి సంస్థకు బొగ్గు గనులు దక్కేవరకు ఐఎన్టీయూసీ ముందుండి పోరాడుతుందని ఆ యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావు, మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్ పేర్కొన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో సోమవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి భాస్కరాచారి, ఏరియా నాయకులు మాసాడి నారాయణ, శ్రీనివాస్, అందె వీరాస్వామి, శివకుమార్, రామ్మోహన్, చిన్నయ్య, మేకల స్వామి, అడే శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



గనిని సందర్శిస్తున్న జీఎం మనోహర్, అధికారులు

కాసిపేట, జూన్ 24 : రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి జీఎం మనోహర్ కార్మికులకు సూచించారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గని ప్లాన్లను పరిశీలించారు. కాసిపేట-1 ఇంక్లైన్‌లోని 3ఎస్, 10 స్టోవింగ్ ప్యానల్‌ను, వివిధ పని స్థలాలను స్వయంగా పర్యవేక్షించారు. నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను చేరుకునేందుకు సమష్టి కృషితో అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఉత్పత్తి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు సూచనలు సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంట్ వీ రామదాసు, గని మేనేజర్ భూ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 24 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రాజస్వ మండలాధికారులు లోకేశ్వరరావు, కాశబోయిన సురేశ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పకుండా హాజరవ్వాలని, రానివారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అర్జీదారుల దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన చునార్కర్ లలిత.. దివ్యాంగ పింఛన్ కోసం.., వాడిగూడకు చెందిన కుడిమెత రాజ్యలక్ష్మి ఆయా పోస్టు ఇప్పించాలని..,రెబ్బెన మండలానికి చెందిన లింగంపల్లి ప్రశాంత్ గౌడ్.. సబ్సిడీ డబ్బుల మంజూరు కోసం.., సిర్పూర్ (టీ) మండలం డోర్పల్లి గ్రామానికి చెందిన రాంటెంకి కమల్‌నాథ్.. తన భూమిని ఇతరులు పట్టా చేసుకున్నారని విచాణ చేపట్టాలని.., పారిగాం గ్రామానికి చెందిన దుర్కి హరీశ్ కుమార్.. సాంఘిక సంక్షేమ గురుకులంలో ఆరోతరగతి ప్రవేశం కోసం.., కెరమెరి మండలం ధనోరా గ్రామానికి చెందిన జాదవ్ విఠల్ వృద్ధాప్య పింఛన్ కోసం.., బెజ్జూర్ మండలం పోతేపెల్లి గ్రామానికి చెందిన ఎనుక చిన్నయ్య.. తన భూమి ప్రాణహిత చేవెళ్ల కాలువలో ముంపునకు గురైనందున నష్టపరిహారం ఇప్పించాలని.., తిర్యాణి మండలం మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన మడావి సూరు.. తన భూమికి కొలతలు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దవాగు వంతెన త్వరగా నిర్మించాలి

**సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు నిరవధిక సమ్మె**



సమ్మెలో కూర్చున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్ : అందవెల్లి పెద్దవాగు వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు పనుల్లో జాప్యానికి నిరసనగా వంతెనపై సోమవారం నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దహెగాం, భీమిని మండలాల ప్రజలు రవానా సౌకర్యం లేక అనేక అవస్థలు పడుతున్నారని, వాహనాలు బ్రిడ్జీపై నుంచి వెళ్లే దాకా దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి అందవెల్లి పెద్దవాగు తాత్కాలిక వంతెనను పూర్తి చేశారు. నిరవదిక సమ్మె చేస్తున్న ఎమ్మెల్యేకు అందవెలి గ్రామానికి చెందిన గుండా సంతరమ్మ నిమ్మరసం ఇచ్చి, దీక్ష విరమింపజేశారు. అనంతరం ఎమ్మెల్యే బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలు ప్రారంభించారు. 24 గంటల్లోనే వాహనాల రాకపోకలను పునరుద్ధరించడం ప్రజా విజయమని, ఇందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రంగానికి ధన్యవాదాలు తెలిపారు.

### ఇసుక లారీల పట్టివేత

జైనూర్, జూన్ 24 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను సోమవారం పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ అంజయ్య తెలిపారు. జైనూర్‌లోని అంబేద్కర్ సెంటర్ వద్ద జైనూర్ సీఐ, పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆసిఫాబాద్ వైపు నుంచి రెండు లారీలు ఇసుకలోడ్‌తో వచ్చాయని పేర్కొన్నారు. వాటిని పరిశీలించగా, అనుమతి పత్రాలు లేకపోవడంతో పట్టుకున్నామని తెలిపారు. డ్రైవర్లు హక్ రమేశ్, జగన్‌ను విచారించగా, యజమానులు నానక్, గోపాల్ ఆదేశాల మేరకు చెన్నూరు గోదావరి నుంచి ఆదిలాబాద్‌కు ఇసుక రవాణా చేస్తునట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

**మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి**



సేంద్రియ ఎరువులు పంపిణీ చేస్తున్న డీపీవో భిక్షపతి

కౌటాల, జూన్ 24 : సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట దిగుబడులు పెరుగుతాయని డీపీవో భిక్షపతి గౌడ్ రైతులకు సూచించారు. కౌటాల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంట సిరి ( సేంద్రియ ఎరువు) విక్రయ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ప్రతి రైతూ తప్పకుండా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. పంటల దిగుబడి కోసం అధికంగా ఇతర కెమికల్ ఎరువులను వాడడం వల్ల భూమిలోని సారం తగ్గిపోయి అనేక రకాల అనర్థాలు కలిగే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. కౌటాల మండలంలోని పంచాయతీ సిబ్బంది చెత్తను వృథా చేయకుండా సేంద్రియ ఎరువు తయారు చేయడం అభినందనీయమన్నారు. దీని ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరగడంతో పాటు రైతులకు తక్కువ ఖర్చుకు ఎరువులను అందించడం జరుగుతుందన్నారు. కౌటాల మండలంలో సోమవారం 20 పంచాయతీల్లో 1730 కిలోల సేంద్రియ ఎరువును విక్రయించడం ద్వారా రూ.51,900 వచ్చినట్లు ఎంపీడీవో నస్రుల్లా ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, జడ్పీటీసీ అనూష, వైస్ ఎంపీపీ అమ్మక్క, ఎంపీటీసీలు మోతీరాం, శిరీష, ఎంపీవో మహేందర్ రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

చింతలమానేపల్లి, జూన్ 24 : గూడెంలో గల పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయాధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గూడెం అంతర్రాష్ట బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా ఎరువులను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, చర్యలు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## నైనీ ప్రాజెక్టుకు పూర్తి సహకారం

- సింగరేణి సీఎండీ బలరాం వెల్లడి



ఒడిశా పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీసీసీ ఎప్తోనూతో మాట్లాడుతున్న సీఎండీ

శ్రీరాంపూర్, జూన్ 24 : ఒడిశా రాష్ట్రంలోని నైనీ గని నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యేలా, నైనీ సమీపంలో నిర్మించ తలపెట్టిన థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం గుర్తింపు కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. ఒడిశాలో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతీప్ కుమార్ జెనాతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నైనీ బ్లాక్‌కు సంబంధించి అన్ని అనుమతులు లభించిన విషయాన్ని, రెండో దశ అటవీ అనుమతుల్లో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా సింగరేణి చర్యలు తీసుకుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో పొందుపర్చినట్లు, రూ.39 కోట్లు డిపాజిట్ చేసినటుల సీఎండీ వివరించారు. ప్రాజక్టు ప్రారంభానికి కావాల్సిన 783 హెక్టార్ల అటవీ భూమిని సింగరేణికి బదాలాయించాలని కోరారు. సింగరేణి ఆధ్వర్యంలో నైనీ ప్రాజెక్టుకు సమీపంలో 1600(2/800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఆ ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఒడిశా ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్( ఇడ్కో) చైర్మన్ హేమంత్ శర్మను కలిశారు. నైనీ బొగ్గును సింగరేణి థర్మల్ విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. థర్మల్ ప్లాంట్ ఏర్పాటు కోసం సింగరేణి ఉన్నతాధికారుల బృందం గతంలో ఆ ప్రదేశాన్ని పరిశీలించిందని వివరించారు. దీనిపై స్పందించిన హేమంత్ శర్మ.. సింగరేణి పరిశీలించిన స్థలాలపై ఇడ్కో సీజీఎం(ల్యాండ్) సరోజ్‌కుమార్ సేథీతో మాట్లాడారు. సింగరేణికి సహకారం అందించాలని సూచించారు. అనంతరం ఒడిశాలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ సుశాంత్ నందాను సీఎండీ కలిశారు. అటవీ భూమిని బదలాయించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

### రూ.20 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలి

బెల్లంపల్లి, జూన్ 24 : సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.20 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి మనిరామ్‌సింగ్ కోరారు. ఈ మేరకు గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. 2016-18 మధ్య కాలంలో రిటైర్డ్ అయిన కార్మికులకు పెరిగిన గ్రాట్యూటీ చెల్లించకపోవడంతో 3,816 మంది కార్మికులు అన్యాయానికి గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.10 లక్షల గ్రాట్యూటీపై ఉన్న సీలింగ్ తీసివేసి, రూ.20 లక్షలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, నాయకులు డీ చంద్రమౌళి, వీ వెంకటస్వామి, పాషా, జీవరత్నం, జీ గంగయ్య, పొంతం యాదగిరి, బొల్లు మల్లయ్య, రమేశ్, నరసింహా, కొత్తూరు నారాయణ, ఎస్కే ఇమామ్ పాల్గొన్నారు.

